## కూలీల సంఖ్యను పెంచాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో రాజేశం

రాజంపేట్, ఫిబ్రవరి 29 : మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో ఎంపీడీవో రాజేశం గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీల సంఖ్యను పెంచాలన్నారు. నర్సరీల్లో మొక్కలకు సరైన సమయంలో నీరు అందించాలని సూచించారు. గ్రామాల్లో తాగు నీటి సమస్య తలెత్తకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. పారిశుద్ధ్యంపైన ప్రత్యేక శద్ధ వహించాలని సూచించారు. ఈ నెల 3వ తేదీన పల్స్ పోలియో కార్యక్రమం ప్రతి గ్రామ పంచాయతీలో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో రఘురాం, ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## 'గురుకుల పాఠశాలల నిర్వహణలో ప్రభుత్వం విఫలం'

బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 29 : ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గురుకులాలు, కేజీబీవీ, ఆదర్శపాఠశాల నిర్వహణలో విఫలమైందని బీఆర్ఎస్వీ రాష్ట్ర మాజీ కార్యదర్శి ఎర్రవాటి సాయిబాబా విమర్శించారు. గురువారం ఆయన హన్మాజీపేట్ గ్రామంలో విలేకరులతో మాట్లాడారు. పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మంచి పౌష్టికాహారం అందించేందుకు గత ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి అండగా నిలిచిందని అన్నారు. గురుకుల పాఠశాలలో విద్యార్థుల ఆత్మహత్యలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ప్రభుత్వం ఏర్పడి రెండు నెలల గడుస్తున్నా సంబంధితశాఖకు మంత్రే లేడని ఎద్దేవా చేశారు. గురుకులాలు, సంక్షేమ, కేజీబీవీ హాస్టళ్ల నిర్వహణ అధ్వానంగా మారిందని విమర్శించారు. ప్రభుత్వం చొరవ తీసుకోని విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు.

## జిల్లాలో 30 యాక్ట్ అమలు

కామారెడ్డి, ఫిబ్రవరి 29 : జిల్లా వ్యాప్తంగా పోలీసు యాక్ట్ 1861ని అమలు చేస్తున్నట్లు ఎస్పీ సింధూశర్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో శాంతి భద్రతల దృష్ట్యా 30 యాక్ట్, పోలీసు యాక్ట్ 1861 జిల్లాలో అమలులో ఉంటుందన్నారు. రాజకీయ పార్టీలు, వివిధ సంఘాల నాయకులు ఎవరైనా సభలు, సమావేశాలు, ర్యాలీలు, ధర్నాలు నిర్వహించాలనుకుంటే స్థానిక పోలీసు స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలని సూచించారు. అనుమతి లేకుండా నిర్వహిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ యాక్ట్ ఈ నెల 31వ తేదీ వరకు అమలులో ఉంటుందని తెలిపారు.

## వరి పంట పరిశీలన

బీబీపేట్, ఫిబ్రవరి 29: మండల కేంద్రంలో సాగుచేస్తున్న వరి పంటను ఏఈవో రాఘవేంద్ర గురువారం పరిశీలించారు. వాతావరణ మార్పులతో వరిలో బ్యాక్టీరియా, ఆకు ఎండు తెగులు గమనించి వాటి నివారణ చర్యలకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మాల్‌ప్రాక్టీస్ జరుగకుండా చర్యలు తీసుకోవాలి

**కలెక్టర్ జితేశ్ వీ పాటిల్**

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 29: ఇంటర్ పరీక్షల్లో మాల్‌ప్రాక్టీస్ జరుగకుండా చర్యలను తీసుకోవాలని కలెక్టర్ జితేశ్ వీ పాటిల్ అధికారులకు సూచించారు. ఎల్లారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటుచేసిన ఇంటర్ పరీక్షాకేంద్రాన్ని గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షకు హాజరైన విద్యార్థుల వివరాలు, సెంటర్‌లో ఏర్పాటుచేసిన మౌలిక వసతులపై ఆ కళాశాల ప్రిన్సిపాల్‌ను అడిగి తెలుసుకొన్నారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ అల్లం మహేందర్ తదితరులు ఉన్నారు.



ఎల్లారెడ్డిలోని ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ జితేశ్ వీ పాటిల్

## సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి




విద్యార్థులకు పరీక్ష ప్యాడ్‌లు పంపిణీ చేస్తున్న ఎంఈవో

రాజంపేట్, ఫిబ్రవరి 29 : సమయాన్ని సద్వినియోం చేసుకొని ఆత్మవిశ్వాసంతో చదివి వంద శాతం ఫలితాలు సాధించాలని మండల విద్యాశాఖ అధికారి రామస్వామి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు విజయ స్ఫూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గుండారం ఎంపీటీసీ హాజీ నాయక్ విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ బ్రిడ్జ్ ఫర్ ఎడ్యుకేషన్ సంస్థ ప్రతినిధిలు కృష్ణారావు, వంశీ, అన్వేశ్‌రావు, కృష్ణాకర్ రావు, ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కంటి శిబిరానికి విశేష స్పందన

కామారెడ్డి, ఫిబ్రవరి 29 : జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాద్ మెడివిజన్ కంటి దవాఖాన వైద్యులతో గురువారం ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు నిట్టు విఠల్ రావు ప్రారంభించారు. సుమారు 50 మంది విశ్రాంత ఉద్యోగులు పాల్గొన్నారు. 11 మందికి చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని మెడివిజన్ కంటి దవాఖానకు పంపించారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

## మాజీ ప్రధాని జయంతి



నివాళులర్పిస్తున్న పాఠశాల సిబ్బంది, విద్యార్థులు

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 29 : బీర్కూర్‌లోని ప్రాథమిక పాఠశాలలో మాజీ ప్రధాన మంత్రి మొరార్జీ దేశాయ్ జయంతిని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు లక్ష్మీనారాయణ, దుర్గా ప్రసాద్, విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయ రహదారిపై ప్రమాదం

- వాటర్ ట్యాంకర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు
- బస్సు డ్రైవర్‌తోపాటు పది మంది ప్రయాణికులకు గాయాలు

భిక్కనూరు, ఫిబ్రవరి 29: మండలంలోని జంగంపల్లి శివారులో ఉన్న జాతీయరహదారిపై ఆర్టీసీ బస్సు వాటర్ ట్యాంకర్‌ను ఢీకొనగా.. డ్రైవర్‌తోపాటు పది మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ ఘటన గురువారం చోటుచేసుకొనగా.. ఇందుకు సంబంధించి ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం. జంగంపల్లి శివారులో ఉన్న ఏ వన్ హర్యానా దాబా ఎదురుగా జాతీయరహదారిపై ఉన్న డివైడర్లలోని మొక్కలకు జీఎంఆర్ సంస్థకు చెందిన వాటర్ ట్యాంకర్ ద్వారా సిబ్బంది నీళ్లను పోసుకుంటూ వెళ్తున్నారు. ఈ క్రమంలో నిర్మల్ డిపోనకు చెందిన ఆర్టీసీ సూపర్ లగ్జరీ బస్సు వాటర్ ట్యాంకర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు డ్రైవర్‌కు తీవ్ర గాయాలుకాగా.. అందులో ప్రయాణిస్తున్న పది మందికి స్వల్ప గాయాలయ్యాయి. హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకున్న సీఐ సంపత్, ఎస్సై సాయికుమార్ తమ సిబ్బందితో కలిసి క్షతగాత్రులను నాలుగు అంబులెన్స్‌ల్లో కామారెడ్డి ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ప్రమాదం కారణంగా వాహనాలు నిలిచిపోగా.. వాటర్ ట్యాంకర్‌ను పక్కకు తరలించి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



ధ్వంసమైన బస్సు ముందు భాగం

## హైకోర్టు ఏజీపీగా రవి నియామకం



బాన్సువాడ రూరల్, ఫిబ్రవరి 29 : రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం (హైకోర్టు)లో ప్రభుత్వం తరపున వాదించేందుకు ఏజీపీ (అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్)గా బాన్సువాడ మండలం బోర్లం క్యాంపు తండాకు చెందిన యువ న్యాయవాది ధారవత్ రవి నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వ న్యాయశాఖ కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేశారు. కొన్నేళ్లుగా హైకోర్టులో ప్రాక్టీసు చేస్తున్న రవిని.. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు నియమించినట్లు ఆయన తెలిపారు. మూడేండ్లపాటు ఏజీగా కొనసాగనున్నట్లు వివరించారు. ఏజీపీగా రవి నియామకంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలి



పాల్వంచలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

బీబీపేట్/మాచారెడ్డి, ఫిబ్రవరి 29 : కామారెడ్డి జిల్లా కేంద్రంలో నేడు (శుక్రవారం) నిర్వహించే బీజేపీ విజయ సంకల్ప యాత్రను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండలాధ్యక్షుడు రవీందర్, జిల్లా ఓబీసీ ఉపాధ్యక్షుడు తోట బాల్ రాజు అన్నారు. మండల కేంద్రంలో ఆయన గురువారం విలేకరులతో మాట్లాడుతూ.. కామారెడ్డిలో బస్సు యాత్రను నిర్వహిస్తారని, గర్గుల్ గ్రామం నుంచి కామారెడ్డి జేపీఎన్ చౌరస్తాలో వరకు బైక్ ర్యాలీ, అనంతరం బహిరంగ సమావేశం ఉంటుందని అన్నారు.

## పెండ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య

భిక్కనూరు, ఫిబ్రవరి 29 : మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామంలో ఉరేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఎస్సై సాయికుమార్ గురువారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. కోడూరి శ్రీకాంత్‌గౌడ్(36) కల్లు దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. కొన్ని నెలలుగా పెండ్లి సంబంధాలు చూసినా అవి కుదరకపోవడంతో మానసింగా కుంగిపోయేవాడన్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. మృతి తల్లి నర్సవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## జేసీబీ, టిప్పర్ సీజ్

నస్రుల్లాబాద్, ఫిబ్రవరి 29 : బీర్కూర్ మండలం అన్నారం గ్రామ శివారులో మొరం అక్రమ తవ్వకాలను గురువారం అడ్డుకున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు. మొరం తవ్వుతున్న ఒక జేసీబీ, ఒక టిప్పర్‌ను సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు తహసీల్దార్ లత, ఆర్ఐ సురేందర్‌రెడ్డి తెలిపారు.

## రంగంపేట్‌లో జడ్పీ సీఈవో పర్యటన



నర్సరీని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో చందర్‌నాయక్

రామారెడ్డి, ఫిబ్రవరి 29: మండలంలోని రంగంపేట్‌లో జడ్పీ సీఈవో, ఇన్‌చార్జి డీఆర్డీఏ చందర్‌నాయక్ గురువారం పర్యటించారు. గ్రామంలోని నర్సరీని పరిశీలించారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున మొక్కలకు రోజుకు మూడు నాలుగుసార్లు నీళ్లు అందించాలని నిర్వాహకులకు సూచించారు. ఎండ తగలకుండా ప్రత్యామ్నాయంగా నెట్‌షెడ్లు వేసుకోవాలన్నారు. మొక్కలతోపాటు పూలు, పండ్లు, కరివేపాకు తదితర మొక్కలు నాటాలని పంచాయతీ కార్యదర్శి రవికి సూచించారు. మొక్కల సంరక్షణ బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లు తీసుకోవాలని స్పష్టం చేశారు. సీఈవో వెంట ఎంపీడీవో సవితారెడ్డి, ఉపాధి హామీ ఏపీవో ధర్మారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ జగదీశ్వర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## 3న ఎల్లారెడ్డిలో పల్స్ పోలియో

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 29: ఎల్లారెడ్డి మండలంలో మార్చి 3వ తేదీన 'పోలియో ఆదివారం' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మత్తమాల పీహెచ్‌సీ వైద్యుడు శరత్‌కుమార్ తెలిపారు. గురువారం మండలంలోని మత్తమాల పీహెచ్‌ఎస్‌లో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నవజాత శిశువుల నుంచి ఐదేండ్లలోపు పిల్లలకు అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామపంచాయతీ భవనాల వద్ద, సూచించిన ప్రత్యేక స్థలాల్లో పోలియో చుక్కలు వేస్తారని తెలిపారు. 3వ తేదీన పోలియో చుక్కలు వేయించుకోని వారికి 4,5వ తేదీల్లో ప్రత్యేక బృందాలు ఇంటింటికీ తిరుగుతూ వేస్తారని చెప్పారు. మండలంలోని 3,138మంది పిల్లలకు వందశాతం పోలియోచుక్కలు వేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో హెచ్ఈవో త్రివిక్రమరావు, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవం

**హాజరైన ప్రజాప్రతినిధులు**



నవగ్రహ ప్రతిష్ఠకు పూజలు నిర్వహిస్తున్న మఠాధిపతి సోమయప్ప స్వామి



మాజీ ఎమ్మెల్యే షిండేను సన్మానిస్తున్న ఆలయ పూజారి

బిచ్కుంద, ఫిబ్రవరి 29: మండల కేంద్రంలో సద్గురు బసవ లింగప్ప స్వామి సంస్థాన మఠం ఆధ్వర్యంలో కాశీవిశ్వనాథ స్వామి ఆలయంలో శ్రీ గణపతి, అన్నపూర్ణ దేవి, నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. రెండు రోజులుగా కొనసాగుతున్న ఉత్సవాలు గురువారం సంపూర్ణమయ్యాయి. చివరి రోజు ఆలయంలో కుంకుమార్చన నిర్వహించగా.. పెద్దసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. సద్గురు సోమయప్ప స్వామి, సిద్ధగయా శివాచార్య స్వామి ఆధ్వర్యంలో ఉత్సవాలు కొనసాగాయి. కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు, మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

## చిన్నపిల్లలతో పనిచేయిస్తే చర్యలు

**డీసీపీవో స్రవంతి**



ఉప్పల్‌వాయి ఇటుక బట్టీ వద్ద ఏర్పాటు చేసిన ఆవాస ప్రాంత పాఠశాలలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న డీసీపీవో స్రవంతి

రామారెడ్డి, ఫిబ్రవరి 29: ఇటుక బట్టీల యజమానులు చిన్నపిల్లలతో పనులు చేయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీసీపీవో (డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్) స్రవంతి హెచ్చరించారు. గురువారం ఆమె మండలంలోని ఉప్పల్‌వాయి గ్రామ శివారులోఉన్న ఇటుక బట్టీల వద్ద ఇటీవల ఏర్పాటు చేసిన ఆవాస ప్రాంత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను తెలుసుకొన్నారు. శ్రద్ధగా చదువుకోవాలని సూచించారు. సీఆర్పీ మహమూద్, సూర్య ప్రకాశ్, వలంటీర్ వెంకటేశ్, దినేశ్ తదితరులు ఉన్నారు.

## ఎల్లారెడ్డిలో ఇంటి పన్ను వసూలు

ఎల్లారెడ్డి రూరల్, ఫిబ్రవరి 29: ఎల్లారెడ్డి పట్టణంలో మున్సిపల్ సిబ్బంది గురువారం ఇంటి పన్ను వసూలు చేపట్టారు. స్థానిక నాయకుడు షేక్ గయాజుద్దీన్ తన ఇంటి పన్ను, మదర్సాకు చెందిన పన్నులను చెల్లించారు. ఒక్కరోజే రూ. 70వేల పన్ను వసూలు చేసినట్లు మున్సిపల్ సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో వార్డు ఆఫీసర్లు సంతోష్‌రెడ్డి, శ్రీకాంత్, మున్సిపల్ కారోబార్ దేవీదాస్, సిబ్బంది రాజు, దేవరాజు, ప్రశాంత్, గంగారాం తదితరులున్నారు.

## మంగ్లూర్‌లో సీసీరోడ్డు పనులు ప్రారంభం

నిజాంసాగర్, ఫిబ్రవరి 29: మండలంలోని మంగ్లూర్ గ్రామంలోని పలు కాలనీల్లో సీసీ రోడ్డు పనులను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు సహకారంతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టినట్లు తెలిపారు.

## రామారెడ్డిలో వివాహిత ఆత్మహత్య

రామారెడ్డి, ఫిబ్రవరి 29: మండల కేంద్రంలో ఆర్థిక ఇబ్బందులతో ఓ మహిళ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై కొండా విజయ్ గురువారం తెలిపారు. మండల కేంద్రానికి చెందిన చింతకుంట కవిత (36) కొంతకాలం క్రితం ఓ బ్యాంకు నుంచి రూ.2.50 లక్షలు రుణం తీసుకున్నదని పేర్కొన్నారు. రుణవాయిదా చెల్లించడంలో ఆర్థిక ఇబ్బందులు తలెత్తడంతో గురువారం తన ఇంట్లో దూలానికి చీరతో ఉరేసుకొని ఆత్మహత్య చేకున్నట్లు ఎస్సై తెలిపారు. మృతురాలి భర్త చింతకుంట కిషన్ ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. కవితకు ఒక కుమారుడు ఉన్నాడని తెలిపారు.

## ఉత్తమ ఫలితాలు సాధించాలి

పిట్లం, ఫిబ్రవరి 29: మండలకేంద్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలలో గురువారం పాఠశాల హెచ్ఎం రఫత్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎంఈవో దేవీసింగ్ హాజరై మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి పాఠశాల, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు గణేశ్‌రావు, సంతోష్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటుచేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు

డోంగ్లీ, ఫిబ్రవరి 29: మండలంలో జొన్న కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని రైతులు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు వారు తహసీల్ కార్యాలయంలో తహసీల్దార్ రేణుకా చౌహాన్‌కు గురువారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ..ఉమ్మడి మండలంలో 1740 ఎకరాల్లో జొన్న సాగవుతుందని తెలిపారు. జొన్న కోతలు రెండు వారాల్లో పూర్తవుతాయని, కేంద్రాలు ఏర్పాటు చేసి పంటను కొనుగోలు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో రైతులు మోహన్, శంకర్ అప్పా, మాధవరావు, మారుతి తదితరులు ఉన్నారు.

# మరోసారి మోదీనే ప్రధాని



బాన్సువాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి

**కామారెడ్డి ఎమ్మెల్యే కాటిపల్లి వెంకటరమణారెడ్డి**

పెద్దకొడప్‌గల్/బాన్సువాడ టౌన్, ఫిబ్రవరి 29: దేశంలో మరోసారి మోదీనే ప్రధానిగా ఉంటారని కామారెడ్డి ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అన్నారు. పెద్ద కొడప్‌గల్ మండలంలోని బాబుల్‌గావ్ గ్రామం నుంచి విజయ్ సంకల్ప్ యాత్రప్రారంభించి జుక్కల్, బాన్సువాడలో గురువారం సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి ఆరు గ్యారెంటీలు అమలుచేయాలంటే రూ.2లక్షల కోట్ల అప్పు చేయాలన్నారు. ఆయన కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నాడని అన్నారు. రేవంత్‌రెడ్డి చెప్పేది కొండంత, చేసేది గోరంత అని విమర్శించారు. రాష్ట్రం గురించి పట్టించు కోవడంలేదన్నారు. మహాలక్ష్మి పథకం ప్రారంభించి, ఆర్టీసీ భూములను లీజ్‌కు ఇస్తామని చెప్పారన్నారు. జుక్కల్, బిచ్కుంద, పిట్లం, నిజాంసాగర్ బస్టాండ్లను లీజ్‌కు ఇస్తే ఒకరికే లాభం, అందరికీ నష్టం జరుగుతుందన్నారు. జుక్కల్ నియోజకవర్గంలో ఎక్కడ కూడా అభివృద్ధి జరగలేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ, పార్టీ కామారెడ్డి జిల్లా అధ్యక్షురాలు అరుణతార, నాయకుడు సుభాష్‌రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# దళితుల అభ్యున్నతికి కృషి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు

**జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు**

మద్నూర్, ఫిబ్రవరి 29: దళితుల అభ్యున్నతికి కృషిచేస్తానని జుక్కల్ ఎమ్మెల్యే లక్ష్మీకాంతారావు అన్నారు. మండలంలోని శేఖాపూర్ గ్రామంలో గురువారం నిర్వహించిన దళిత దండోరా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమాజంలో దళితులు వెనుకబడ్డారని, వారు ఎదగాల్సిన అవసరం ఉందన్నారు. దళితులకు ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్తులు సన్మానించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, దళితులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయులకు సన్మానం



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పీఆర్టీయూ ప్రతినిధులు

నిజాంసాగర్, ఫిబ్రవరి 29: నిజాంసాగర్ మండలంలోని అచ్చంపేట్ గ్రామంలో విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను పీఆర్టీయూ బాన్సువాడ అధ్యక్షుడు భాస్కర్‌గౌడ్ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వెంకట్‌రాంరెడ్డి, అమర్‌సింగ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIEDS క్లాసిఫైడ్స్

**డాక్యుమెంట్ పోయినది**

నేను తీగల శ్రీకాంత్, తండ్రి పేరు. కీ॥శే॥ తీగల లింబాద్రి, ఇ.నెం. 3-71, గ్రా॥ & మం॥ మోర్తాడ్, జి॥ నిజామాబాద్, Pin:503225, తెలంగాణ రాష్ట్రం. నేను 11-04-2023 నాడు నా యొక్క ఒరిజినల్ రిజిస్ట్రేషన్ గిఫ్ట్ (సెటిల్‌మెంట్) డీడ్, డాక్యుమెంట్ నెం. 1774/2011 తేది. 29-10-2011 గల డాక్యుమెంట్‌ని తీసుకొని మా ఇంటి నుండి మోర్తాడ్ బస్టాండ్‌కి వెళ్తున్న సమయంలో ఎక్కడో పడిపోయినది. కావున దొరికిన వారు ఈ నెంబరుకు తెలియజేయగలరు.

సెల్: 9133143963

**WANTED**

★ హరేకృష్ణ హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్: 6K. Ph: 9640468899 / 9640258899.

NT-319447-All

**గమనిక**

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల క్లాసిఫైడ్స్ 200/- మాత్రమే,
"పేరు మార్పిడి" ప్రకటన
4 లైన్లకు 250/-
GST వర్తించును